నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, శనివారం 28 సెప్టెంబర్ 2024 HYDERABAD


## నో వాల్ పోస్టర్లు.. వాల్ రైటింగ్స్




సిటీబ్యూరో, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంపొందించడం, సుందరీకరణే లక్ష్యంగా అనుమతులు లేని వాల్ పోస్టర్లు, వాల్ రైటింగులను నిషేధించినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. అనుమతులు లేకుండా గోడలపై పోస్టర్లు అంటించడం, వాల్ రైటింగ్స్ చేసినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు తమ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్, సినిమా థియేటర్ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి.. గోడలపై వాల్ పోస్టర్లు, సినిమా పోస్టర్లు అంటించకుండా వాల్ రైటింగ్ రాయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో డిప్యూటీ కమిషనర్లు అశ్రద్ధ వహించకుండా కఠినంగా వ్యవహరించాలని, అనుమతి లేకుండా వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్ చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే జరిమానాలు విధించాలన్నారు.


కొత్తపేటలో సొమ్మసిల్లిన ఓ మహిళ


అత్తాపూర్ క్రాస్‌రోడ్ వద్ద నిర్వాసితుల నిరసన



సర్వే సైరన్.. మూసీ నిర్వాసితుల పరేషాన్

# క్షణ క్షణం.. బుల్డోజర్ భయం!

పోలీసు పహారాలో మార్కింగ్

గూడు కోసం రాత్రుల్లో సైతం కాపలా • రెండో రోజూ పరీవాహక ప్రాంతాల్లో సర్వే

- అడ్డొస్తే లోపలేస్తామంటూ నిర్వాసితులకు బెదిరింపులు
- డ్రోన్ సర్వే ఆధారంగానే డబుల్ బెడ్రూంలు
- మూసీ తీరం వెంట 40వేలకు పైగా కట్టడాలు
- రివర్ బెడ్‌లోనే వేలాదిగా..
- వాటికి మార్కింగ్ చేయని వైనం
- రెండు పడకల ఇండ్లు లేనట్టేనా.. అనే సందేహాలు
- కాలనీలోకి రావొద్దంటూ.. అధికారులను అడ్డుకున్న బాధితులు
- మార్కింగ్ వద్దంటూ వేడుకోలు
- పెట్రోల్ పోసుకొని.. పూల వ్యాపారి ఆత్మహత్యాయత్నం




ఏ క్షణం.. ఏ బుల్డోజర్ తమపైకి వచ్చి పడుతుందోనన్న గాబరా..ఇన్నేండ్ల ఆధారం రెప్పపాటులో కుప్పకూలిపోతుందేమోనన్న హైరానా.. వెరసి మూసీ నిర్వాసితులు క్షణక్షణం భయంతో గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారుల సర్వే వారికి మరింత గుండెదడ తెప్పిస్తున్నది. మూసీ పరీవాహక ప్రాంతాల్లో రెండో రోజు శుక్రవారం సైతం నిరసనలు, ప్రతిఘటనల మధ్యే రెవెన్యూ అధికారుల సర్వే కొనసాగింది. ఉప్పల్, రాజేంద్రనగర్, బహదూర్‌పురా, ఆసిఫ్‌నగర్, చార్మినార్, అంబర్‌పేట, గోల్కొండ ఇబ్రహీంబాగ్, లంగర్‌హౌస్ డిఫెన్స్ కాలనీ, చాదర్‌ఘాట్, శంకర్‌నగర్, ముసారాంబాగ్, కొత్తపేట, మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో సర్వే చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌లో 26 బృందాలు మూసీ రివర్ బెడ్‌లో ఉన్న నిర్మాణాలకు మార్కింగ్ చేశాయి. అయితే అధికారులకు ఎక్కడికక్కడ వ్యతిరేకతే ఎదురైంది. నిర్వాసితులు సర్వే బృందాలను తమ ఇండ్ల వద్దకు రానివ్వకుండా అడ్డుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో స్థానికులకు, అధికారులకు మధ్య తోపులాట జరిగింది. ఇంకొన్ని చోట్ల తమ ఇండ్లకు మార్కింగ్ ఇవ్వొద్దంటూ భీష్మించుకూర్చున్నారు. చైతన్యపురిలో ఓ పూల వ్యాపారి ఆత్మహత్యకు యత్నించడం మరింత ఉద్రిక్తత పెంచింది. పాతబస్తీలో మూసీ నిర్వాసితులు రోడ్లపైకి వచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేపట్టారు. 'రేవంత్ రెడ్డి నువ్వు సీఎం కావడం మా దౌర్భాగ్యం' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్డుకోవడానికి యత్నిస్తున్న చాలా మందికి పోలీసుల నుంచి బెదిరింపులు ఎదురయ్యాయి. లోపలేస్తామంటూ నిర్వాసితులపై జులుం ప్రదర్శించినట్టు బాధితులు తెలిపారు.

-సిటీబ్యూరో, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ)



కాంగ్రెస్ సర్కార్‌కు పేదల ఉసురు తగుల్తది!



## పునరావాసాలపై డ్రోన్ దెబ్బ..

అసలే గూడు కోల్పోవాల్సి వస్తున్నదని బాధపడుతున్న బడుగులకు మరో ఎదురుదెబ్బ తగలనున్నది. మూసీ రివర్ బెడ్‌లో నివాసమున్న అందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు వచ్చే అవకాశం లేదు. అధికారులు కేవలం కొన్ని నిర్మాణాలకే మార్కింగ్ చేస్తున్నారు. ఇదేంటని కొంతమంది ప్రశ్నిస్తే డ్రోన్ సర్వే ప్రకారం తమకిచ్చిన నిర్మాణాలకు మాత్రమే మార్కింగ్ చేస్తున్నామంటూ చెబుతున్నారు. డబుల్ బెడ్రూంలు వద్దు ఇక్కడే ఉంటామని చెబుతున్న ఆ ఇండ్ల వారికి అందరికీ గృహాలు రావనే విషయంపై అవగాహన లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని నెలల కిందట మూసీకి ఇరువైపులా 2 కిలో మీటర్ల మేర డ్రోన్ సర్వే చేపట్టింది. ఆ సర్వేలో ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్ జోన్‌లో ఎన్ని ఆక్రమణలున్నాయో సర్వే చేశారు. జీయో ఇన్ఫర్మేషన్ సిస్టం(జీఎస్ఐ)తో అనుసంధానం చేశారు. కాగా, ఈ సర్వేలో రివర్ బెడ్(నది గర్భం)లో 2,116 నిర్మాణాలు, బఫర్ జోన్‌లో మరో 7,850 నిర్మాణాలున్నాయని అధికారులు గుర్తించారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు వాటికే మార్కింగ్ చేస్తున్నారు. అయితే రివర్ బెడ్‌లో ఉన్న అన్ని నిర్మాణాలకు అధికారులు మార్కింగ్ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కూల్చివేతలు ప్రారంభమయ్యాక మార్కింగ్ వేసినవి..వేయనివి అన్నీ మూసీలో కలిసిపోతాయి. కేవలం అధికారులు మార్కింగ్ వేసిన వారికి మాత్రమే డబుల్ బెడ్రూంలు కేటాయించనున్నారు. మిగిలిన వారు రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడనున్నదని సామాజికవేత్తలు చెబుతున్నారు.




## ఎక్కడికో తరలిస్తే.. మా జీవనోపాధి ఎలా?

అధికారుల కాళ్ల వేళ్ల పడుతూ.. మూసీ వాసులు ఆర్తనాదాలు చేస్తున్నారు. అయినా వీరి ఆక్రందన రేవంత్ సర్కార్ వినడం లేదు. కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని ఇల్లు కట్టుకుంటే కూల్చేస్తామంటూ రావడం ఏంటని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చావడానికైనా సిద్ధం..కూల్చనివ్వమంటూ పూల వ్యాపారి మహేశ్ అధికారులను అడ్డుకునే యత్నం చేశాడు. 'పూల వ్యాపారం చేసుకుంటూ.. నా కుటుంబాన్ని పోషిస్తున్నాను. నా భార్య ఇప్పుడు నిండు గర్భిణి. నా చెల్లెండ్లు ఇక్కడే దగ్గర చదువుకుంటున్నారు. అధికారులు ఇప్పుడు వచ్చి ఎక్కడో నగరం అవతల డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తాం.. ఖాళీ చేయమంటే ఎలా. జీవనోపాధి ఎలా పొందేది. రెక్కాడితో గానీ డొక్కాడని కుటుంబం మాది. ప్రాణం పోయినా ఇక్కడే ఉంటాం.. ఇల్లు మాత్రం ఖాళీ చేయం. బలవంతంగా ఇల్లు ఖాళీ చేయాలని చూస్తే చావడమే శరణ్యం' అంటూ మహేశ్ తల బాదుకుంటూ..పెట్రోల్ పోసుకొని..ఆత్మహత్యకు యత్నించాడు.



అత్తాపూర్‌లో బాధితుల నిరసన

## • ప్రభుత్వ యంత్రాంగమంతా.. మూసీ వెంటే



సిటీబ్యూరో: ప్రభుత్వ యంత్రాంగమంతా మూసీ వెంటే ఉంటోంది. మూసీ రివర్‌బెడ్ పరిధిలోని పలు కాలనీల్లో సిబ్బంది మకాం వేశారు. తహసీల్దార్ల నేతృత్వంలోని బృందాలు సర్వే చేయడం, మార్కింగ్ చేయడానికి సిద్ధమవుతుంటే స్థానికులు అడ్డుకుంటున్నారు. గురువారం కొంత మేరకు మార్కింగ్ చేయగలిగినా.. శుక్రవారం మాత్రం అధికారులను ప్రతిఘటించారు. ఒక వైపు ప్రజలు తమ ఇండ్లు కోల్పోకుండా కాపలా కాస్తుంటే.. మరోవైపు ప్రభుత్వ సిబ్బంది ఎప్పుడెప్పుడు జనాల గృహాలను కూలగొడదామా.. అంటూ తిరుగుతున్నారు.

## ఇల్లే నాకు దిక్కు



పదేండ్లుగా ఇక్కడ ఉంటున్నా. అప్పులు చేసి ఇల్లు కట్టుకున్నా. నా భర్త చనిపోయాడు.. నా పరిస్థితి ఏం బాగలేదు. సొంతింట్లో ఉంటూ.. పిల్లలను చూసుకుంటూ.. జీవిస్తున్నా. రాత్రికి రాత్రి వచ్చి ఇల్లు ఖాళీ చేయాలి.. వర్షాలు వస్తే మూసీ పొంగి.. మీ ఇంట్లోకి నీళ్లు వస్తాయని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉన్నది. ఏనాడూ మూసీ నది బారిన పడలేదు. ఎంతో దిగువన ఉన్న మూసీ నీళ్లు మా కాలనీలోకి వచ్చే మార్గమే లేదు.**- మణెమ్మ**



## ఎక్కడో డబుల్ బెడ్రూం ఇస్తే ఎలా..

పూల వ్యాపారం చేసుకుంటూ.. నా కుటుంబాన్ని పోషిస్తున్నా. నా భార్య ఇప్పుడు నిండు గర్భిణి. నా చెల్లెండ్లు ఇక్కడే దగ్గర చదువుకుంటున్నారు. అధికారులు ఇప్పుడు వచ్చి ఎక్కడో నగరం అవతల డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తాం..ఖాళీ చేయమంటున్నారు. నగరం బయట ఇల్లు ఇస్తే జీవనోపాధి ఎలా పొందాలి. ఇల్లు మాత్రం ఖాళీ చేయం. బలవంతంగా ఇల్లు ఖాళీ చేయించాలని చూస్తే చావే శరణ్యం. **- మహేశ్**

## గరీబోళ్ల పొట్టగొట్టి.. ఏం బాగుపడుతారు



ఇరవై ఏండ్ల కిందట ఇక్కడ పట్టా భూమి కొని ఇల్లు కట్టుకున్నాం. పైసా పైసా కూడబెట్టుకొని కష్టపడి, బంగారం, సొమ్ములు అమ్ముకొని కమలానగర్‌లో ఇల్లు కట్టుకున్నా. వారం, పది రోజుల నుంచి మూసీ నది పేరు చెప్పి భయపెడుతున్నారు. ఇండ్లు కూలుస్తారని చెబుతున్నారు. గరీబోళ్ల పొట్టగొట్టి ఏం బాగుపడుతారు? మా ఇండ్ల కోసం ఆశపడొద్దు. సర్కారు మాకు ఏమీ ఇవ్వకున్నా సరే మా ఇండ్లను కూల్చొద్దు. **-ధనలక్ష్మి, కమలానగర్**



## మా ప్రాణాలు తీసి.. ఇండ్లు కూల్చండి

ముందు మా బస్తీ వాసుల ప్రాణాలు తీసి తర్వాత ఇండ్లు కూల్చమనండి. పేదలను చంపడానికి చూస్తున్నారు. వారం రోజుల నుంచి పనికి పోతలేము. ఎవరూ వస్తారో..ఏమి చేస్తారో అనే బెంగ పట్టుకొని.. తినలేకపోతున్నా. రేవంత్‌రెడ్డి ఇచ్చే పథకాలు వద్దు. మా ఇండ్లు మాకు కావాలి. **- కె.భారతి**

## గూడు రక్షణకు గస్తీ..



గూడు కోసం.. నిర్వాసితులు రాత్రుల్లో సైతం మేల్కొని ఉంటూ కాపలా చేస్తున్నారు. ఎటు నుంచి ఎటు వైపు వచ్చి బుల్డోజర్లు తమ గూడు కూలగొడుతాయోనని మూసీ పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో స్థానికులు మేల్కొని గస్తీ కాస్తున్నారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు అంతా రెండు రోజుల నుంచి నిద్ర లేకుండా రాత్రుల్లో ఆందోళన చెందుతున్నారు. పరిసర ప్రాంత ప్రజలు బృందాలుగా ఏర్పడి హైడ్రాను అడ్డుకోవడంపై చర్చలు చేస్తున్నారు. ఇటువంటి దుస్థితి ఒకటి వస్తుందని తామెప్పుడూ ఊహించలేదని బాధితులు ఆవేదన చెందుతున్నారు. శత్రు దేశాలపై యుద్ధం చేస్తున్నట్టుగానే రేవంత్ ప్రభుత్వం మా బతుకులపై దాడులు చేస్తున్నదని రహీం అనే వ్యక్తి ఆగ్రహం వ్యక్తం చేశాడు. చార్మినార్, అంబర్‌పేట, కొత్తపేట, లంగర్‌హౌస్ తదితర అన్నీ ప్రాంతాల్లో రాత్రి గస్తీ కాస్తూ నిర్వాసితులు తమ గూడు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

### 20 కుటుంబాల తరలింపు: కలెక్టర్ అనుదీప్

మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను మలక్‌పేటలోని పిల్లిగుడిసె, జియాగూడలోని డబుల్ బెడ్రూం ఇండ్లకు తరలిస్తామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. హిమాయత్‌నగర్ మండలం శంకర్‌నగర్‌కాలనీకి చెందిన 20 కుటుంబాలను తరలించినట్లు చెప్పారు.

## ఎక్కువ మాట్లాడితే లోపలేస్తాం.. బిడ్డా!

అసలే గూడు పోతున్నదని బాధలో ఉన్న నిర్వాసితులకు పోలీసుల నుంచి సైతం రక్షణ దొరకడం లేదు. తమ ఇండ్లను కూల్చడానికి వీరెవ్వరూ అంటూ ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇండ్లను కూల్చడానికి మార్కింగ్ చేయొద్దని అధికారులను అడ్డుకునే యత్నం చేస్తున్న వారిపై పోలీసులు ఓవరాక్షన్ చేస్తున్నారు. బెదిరింపులకు పాల్పడుతూ.. ఎక్కువ మాట్లాడితే లోపలేస్తామంటూ బెదిరిస్తున్నారని చెబుతున్నారు. చైతన్యపురి, అంబర్‌పేట, లంగర్‌హౌజ్‌లో పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని తోసేస్తూ అదుపులోకి తీసుకున్నారు.


కార్వాన్‌లోని దరియా బాగ్‌లో పోలీసులతో వాగ్వాదం